క్లుప్తంగా

శ్రమతోనే విజయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కెరీర్ కౌన్సిలర్ ప్రవీణ్ కృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల విజయానికి శ్రమ ఒక్కటే తొలిమెట్టని నేషనల్ కెరీర్ కౌన్సిలర్ ప్రవీణ్ కృష్ణ పేర్కొన్నారు. భారత దేశ జీ-20 ప్రెసిడెన్సీలో భాగంగా జన్ భాగిధరి కార్యక్రమాల్లో బుధవారం స్థానిక ఏలూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యార్థులు తమలోని నైపుణ్యాలను పెంచుకుంటూ ఉన్నత లక్ష్యాల వైపు దృష్టి పెడితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రవీణ్ కృష్ణ పేర్కొన్నారు. పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి పి.రజిత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారులు ఎం.సత్తిబాబు, జి.ప్రేమజ్యోతి, విద్యార్థులు, పీఎంకేవీవై 4.0 షార్ట్‌టర్మ్ కోర్సు శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం



ప్రభాకర్‌ను సన్మానించిన సభ్యులు

ఏలూరు రూరల్: ఏలూరు మార్కెట్‌యార్డ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు అన్నారు. బుధవారం యార్డ్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది నిమ్మకాయలకు గిట్టుబాటు ధర పలకడం వల్ల రైతులు కొంతమేరకు లాభాలు సాధిచారన్నారు. వ్యాపారులు పెద్ద ఎత్తున ఎగుమతులు చేపట్టారని చెప్పారు. ఎమ్మెల్యే ఆళ్లనాని కృషితో ప్రభుత్వం మంజూరు చేసిన జంబోషెడ్డు పనులు సుమారు రూ.4 కోట్లతో చేపట్టామన్నారు. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంతో పాటు మూడు నెలలకు ఒకసారి జరిగే సాధారణ సమావేశ తీర్మాన ప్రతులను ఎమ్మెల్యేకు పంపించాలని సిబ్బందికి సూచించారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు పక్కదారి పట్టించిన లక్షలాది రూపాయల ఏఎంసీ నిధులు తిరిగి రాబట్టాలని సభ్యులు జె.రవికుమార్, మేతర సతీష్‌బాబు, ఎన్ యుగంధర్‌ప్రసాద్, మహమ్మద్ ఖాజీ, కె.దుర్గ, ఎం.భవాని తదితరులు కోరారు. కార్యదర్శి కేఎస్ రాణి పరివేక్షణలో సభ్యులు పలు తీర్మానాలను ఆమోదించారు. బదిలీ అయిన ఇన్‌చార్జి కార్యదర్శి ఎంఎన్‌వీ ప్రభాకర్‌ను శాలువ కప్పి సన్మానించారు.

జేవీకే పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు

- పాఠశాలలకు చేరుకుంటున్న కిట్లు
- విద్యార్థులకు నాణ్యమైన విద్యా వస్తువులు



స్టాక్ పాయింట్ నుంచి జేవీకే వస్తువులను పాఠశాలలకు రవాణా చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మరికొన్ని రోజుల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలకు రావడానికి, మరో మెట్టు ఎక్కి పై తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. బుధవారం నిర్వహించిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో అమ్మఒడి అమలుకు మంత్రివర్గం తీర్మానం చేసింది. కాగా విద్యార్థులకు విద్యాకానుక బడి తెరిచిన రోజే విద్యార్థులకు అందించడానికి విద్యాశాఖ యంత్రాంగం కృషి చేస్తోంది. ఈ మేరకు ఏలూరు నియోజకవర్గ పరిధిలో బుధవారం నుంచి విద్యాకానుక కిట్లను జిల్లా స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు తరలిస్తున్నారు. నాలుగో విడత జగనన్న విద్యాకానుక పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు నియోజకవర్గంలో అర్బన్ పరిధిలో 65 పాఠశాలల్లో 10,437 మంది, ఏలూరు రూరల్ పరిధిలో 57 పాఠశాలల్లో 8,398 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ బడి తెరిచన రోజో విద్యాకానుక వస్తువులు అందించనున్నారు.

నాణ్యమైన వస్తువులు

ఏలూరు నియోజకవర్గంలో విద్యాకానుక నాణ్యమైన వస్తువులను ఇప్పటికే రప్పించారు. పాఠ్యపుస్తకాలు 2,06,461లకు మొదటి విడతలో 65,531, రెండో విడతలో 63,488 పుస్తకాలు వచ్చాయి. మరో 77,442 రావాల్సుంది. నోట్ పుస్తకాలు 1,20,118లకు 1,20,110 స్టాక్ పాయింట్‌కు వచ్చాయి. బూట్లు 17,929, డిక్షనరీలు 2,978 స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయి. ఇక 17,759 జతల యూనిఫారం, 11,702 బెల్టులు రావాల్సి ఉంది.

రవాణా భారానికి చెక్



గతంలో యూనిఫారం, పుస్తకాలు వంటి వన్నీ స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు తీసుకెళ్లేందుకు ప్రధానోపాధ్యాయులకు భారంగా పరిణమించేది. వాళ్ల సొంత ఖర్చులతో స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు తీసుకెళ్లాల్సి వచ్చేంది. ప్రస్తుతం ప్రతి విద్యాకానుక రవాణాకు ప్రభుత్వమే రూ.11.18 వెండర్ ఖాతాలో నేరుగా జమ చేస్తోంది. దీంతో హెచ్‌ఎంలకు ఆర్థిక భారం తగ్గిపోయింది. విద్యాకానుకను బడి తెరిచిన రోజు నుంచే పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం.

– సబ్బితి నరసింహమూర్తి, ఎంఈఓ, ఏలూరు

నేడు వైష్ణవ సేవా సంఘం భవనానికి శంకుస్థాపన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక హేలాపురి శ్రీవైష్ణవ సేవా సంఘ భవన నిర్మాణానికి గురువారం ఉదయం 7.46 గంటలకు ఎమ్మెల్యే ఆళ్ల నాని శంకుస్థాపన చేయనున్నట్టు ఆ సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మాదేపల్లి రోడ్డులోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లో భవన నిర్మాణం తలపెట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఓటరు జాబితాల్లో మార్పులు చేర్పులు పూర్తి చేయాలి

ద్వారకాతిరుమల : ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ బి.దుర్గా మహాలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం బూత్ లెవల్ అధికారులకు స్పెషల్ సమ్మరి రివిజన్-2024 కార్యక్రమం నిర్వహించారు. డీటీ దుర్గా మహాలక్ష్మి మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, మృతి చెందిన వారి ఓట్లు, గ్రామాన్ని విడిచి వెళ్లిపోయిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియ ఈనెల 1 నుంచి ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది జనవరి 5న ముగుస్తుందని తెలిపారు.

రైతే దేశానికి వెన్నెముక

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతే దేశానికి వెన్నెముక అనే అంశంపై గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప విద్యార్థులతో బుధవారం సంభాషణ నిర్వహించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలు కన్నీళ్లు పెట్టకుండా, సంతోషంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు.

మండలాభివృద్ధికి కృషి

దెందులూరు: దెందులూరు మండలాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తిరుపతిస్వామి అన్నారు. ఈఓఆర్‌డీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. టి.నర్సాపురం మండలంలో ఈఓఆర్‌డీగా, ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై వచ్చిన తిరుపతి స్వామికి గ్రామ కార్యదర్శులు స్వాగతం పలికారు.

20 నుంచి పోరుకేక మహా పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు (టూటౌన్): పోలరవం నిరావసితుల పోరుకేక మహాపాదయాత్ర ఈనెల 20 నుంచి నెల్లిపాక నుంచి విజయవాడ వరకు నిర్వహించనున్నట్టు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి వెల్లడించారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ప్రారంభించి 15 ఏళ్లయినా పునరావాసం 10 శాతం మించలేదన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఈ మహా పాదయాత్ర తలపెట్టిమని చెప్పారు. యాత్ర అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక నుంచి జూన్ 20న ప్రారంభమై జూలై 7 వరకు కొనసాగుతుందన్నారు. జూన్ 26న ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట వద్ద ప్రవేశిస్తుందన్నారు. ఈ యాత్ర జిల్లాలో వేలేరుపాడు, కుకునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం వరకు మరో ఉప పాదయాత్ర రెండు రోజులు పాటు నిర్వహించి ప్రధాన పాదయాత్రలో కలుస్తుందని వివరించారు. 400 కిలోమీటర్ల మేరకు సాగే ఈ పాదయాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వం వహిస్తారని తెలిపారు. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని, గోదావరి వరదల నుంచి రక్షించేందుకు ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని, గతేడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం, పునరావాసం చెల్లించాలని కోరారు. కాంటూరు లెక్కలను సరిచేయాలని తదితర 14 డిమాండ్ల సాధనకు ఈ పాదయాత్ర చేపట్టామని రవి వివరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, బి.సోమయ్య మాట్లాడారు.

ఉద్యోగులపై వరాల జల్లు హర్షణీయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులపై వరాల జల్లు కురిపించడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గెద్దం సుధీర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ తరువాత వారి జీవనాన్ని ప్రశ్నార్థకం చేసే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడం రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న సంచలన నిర్ణయమన్నారు. కొత్త జిల్లా కేంద్రాల్లో పని చేసే ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 12 శాతం నుంచి 16 శాతానికి పెంచడంతో వారికి ఆర్థికంగా వెసులుబాటు లభించబోతోందని చెప్పారు. 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా ఆయా కుటుంబాల అభివృద్ధికి ముఖ్యమంత్రి బాటలు వేశారని తెలిపారు. 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులకు భవిష్యత్‌లో మరింత ఫిట్‌మెంట్‌తో వేతనాలు భారీగా పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రూప్-1, -2 పోస్టుల భర్తీకి నిర్ణయించడం నిరుద్యోగులకు శుభవార్తేనన్నారు. ఇవన్నీ ముఖ్యమంత్రి జగన్‌కు ప్రభుత్వ ఉద్యోగులపై ఉన్న సానుకూల దృక్పథానికి నిదర్శనమని వివరించారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత



వరప్రసాద్‌కు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందిస్తున్న శ్రీహర్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ప్రయాణికుల భద్రతకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలోని ఇప్పటికే సుమారు 200 బస్సుల్లో ఫస్ట్ యిడ్ కిట్లను ఏర్పాటు చేశామని, మరో 150 బస్సుల్లోకి ఫస్ట్ ఎయిడ్ కిట్లను స్థానిక స్టార్ డెంటల్ క్లినిక్ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యం అందించిందని వరప్రసాద్ చెప్పారు. స్టార్ డెంటల్ క్లినిక్ ప్రతినిధి డాక్టర్ ఎస్.శ్రీహర్ష మాట్లాడుతూ తమ సంస్థ గత పదేళ్లుగా ప్రజలకు విశేష సేవలందిస్తోందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి ఎంప్లాయీ హెల్త్ స్కీమ్‌లో భాగంగా నగదు రహిత వైద్య సేవలు అందిసుతన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ పీఆర్‌ఓ నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధన సరైన రీతిలో జరగాలి



విద్యార్థులను అభినందిస్తున్న రవిసాగర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాలల్లో విద్యాబోధన సరైన రీతిలో జరగాలని, నూతన విద్యా విధానంలో భాషా నైపుణ్యాలను, సంఖ్యా శాస్త్రాల్లో చిన్ననాటి నుంచే విద్యార్థులకు మెళకువలు నేర్పాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్ సూచించారు. జన్ భాగిధరి కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఆడియో విజువల్ హాలులో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. బాల్య దశలో విద్యార్థులు పలు అంశాలను నేర్చుకోగలిగే సామర్థ్యం కలిగి ఉంటారని, అందుకు తగ్గ బోధనలు అందించే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. ఎస్ఎస్ఏ అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఏవీఎస్ఎన్ భాస్కర్ కుమార్ మాట్లాడుతూ జీ20, పునాది అభ్యసనా నైపుణ్యం, సంఖ్యా నైపుణ్యం గురించి, పాఠశాల స్థాయిలో వాటి అమలు ఏవిధంగా జరగాలో వివరించారు. పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్య అవసరమన్నారు. ఈ సందర్భంగా జీ20, ఎన్ఈపీ, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి సంబంధించిన టీఎల్ఎం, సమ్మర్ క్యాంప్, తరళ్, నిపుణ్‌భారత్ వంటి అంశాలపై పాఠశాల స్థాయిలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలను డాక్యుమెంట్లు, వీడియో క్లిప్పింగులు, ఫొటో ప్రదర్శన ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వీరభద్ర రావు తదితరులు పాల్గొనగా, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, డైట్ లెక్చరర్లు, రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు.

రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంపై వినతి

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వంగపండు వెంకట సత్యనారాయణను బదిలీ చేస్తూ గత నెల 31న ఈఎన్సీ (పీహెచ్) గుంటూరు వారు ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఏలూరు కమిషనర్ రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వకపోడంపై ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు బుధవారం ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ బాపిరాజుకు వినతి పత్రం అందజేశారు. తక్షణమే ఆయన్ని రిలీవింగ్ చేయాలని కోరారు. వెంకట సత్యనారాయణ తన స్థానిక, ఆర్థిక బలంతో రిలీవింగ్ కాకుండా ఏలూరులోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నట్టు యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, ఎ.అప్పలరాజు తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉండడంతోపాటు నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగంలో పని చేసే క్రింది స్థాయి సిబ్బంది పట్ల అసభ్యకరంగా దురుసుగా పనిచేస్తున్న వంగపండుపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అనేక పర్యాయాలు విజ్ఞాపనలు, వినతులు అందజేశామని తెలిపారు. యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, యూనియన్ నాయకులు ధనాల అప్పారావు పాల్గొన్నారు.

11న పౌరాణిక త్రిరత్నాల ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పౌరాణిక నాటకాలను ప్రోత్సహించడంలో భాగంగా హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11న పౌరాణిక త్రిరత్నాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఆ సంఘ యాజమాన్య కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో కానాల గురుమూర్తి కళావేదికపై ఈ ప్రదర్శనలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. పౌరాణిక నాటకాల్లో త్రిరత్నాలుగా పిలవబడే శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని మయసభ సీను, శ్రీకృష్ణ రాయబారం నాటకంలో సెంటర్ సీను, సత్య హరిశ్చంద్ర నాటకంలోని వారణాసి సీనులను నగరానికి చెందిన జైదేవి కనకదుర్గ నాట్య మండలి కళాకారులు ప్రదర్శిస్తారని తెలిపారు.

ప్రజల్లో పెంపొందుతున్న ఆధ్యాత్మిక భావాలు



విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న మేయర్ నూర్జహాన్ పెదబాబు దంపతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతున్నాయని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక 7వ డివిజన్ బెనర్జీపేటలోని సీతారామ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ దంపతులు తొలుత ప్రతిష్ఠా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరిలోనూ శాంతియుత ఆలోచనలు కలుగుతాయని, తద్వారా సమాజంలో సుస్థిర శాంతి స్థాపన సాధ్యమౌతుందని వారు పేర్కొన్నారు. తొలుత ఆలయంలో పునః పూజ, హోమం, గంగాపూజ, పీఠ, యంత్ర పూజ చేసి కుంభం పోసి మహాపూర్ణాహుతి, మంగళ హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు మహాన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, పాలడుగు మురళీ శ్యామ్, రాజా మురళి, బెనర్జీపేట భక్తబృందం పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	..	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	40
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	36
కాకర కాయలు	50	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	44	అల్లం	220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	88
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40